క్లుప్తంగా

వ్యవసాయ కూలీలను ఆదుకోండి



రెంజల్(బోధన్): వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12వేలు చెల్లించి ఆదుకోవాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పార్వతి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మండలంలోని బోర్గాం గ్రామంలో సోమవారం వ్యవసాయ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన నిర్వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నాయకులు ఒడ్డెన్న, నసీర్, పోశెట్టి, లక్ష్మణ్, రవి, సాయిలు పాల్గొన్నారు.

పొగాకు బట్టీలపై అవగాహన



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గ్రామ రైతులకు సోమవారం పొగాకు బట్టీలపై తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అవగాహన కల్పించారు. సోమవారం గ్రామాన్ని సందర్శించిన అనంతరం స్థానిక రైతులతో తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నివేదిక ప్రకారం రైతులు గృహ నివాసాలకు కిలోమీటరు దూరంలో బట్టీలను ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. రైతులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలను పాటించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకోవాలల్సి ఉంటుందన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తరించాలి

బాల్కొండ: రెడ్‌క్రాస్ సంస్థ సేవాలను మరింత విస్తరించాలని ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు గున్నాల వెంకటేశ్ అన్నారు. బాల్కొండ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రెడ్‌క్రాస్ సంస్థ సభ్యుల సమీక్ష సమావేశం నిర్వహించారు. సంస్థ సేవలను ప్రతి పల్లెకు అందించాలన్నారు. జిల్లా కార్యదర్శి అరుణ్‌బాబు, మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



బోధన్: మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్- హ్యూమన్ రైట్స్ ఫోరం) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో ఇటీవల జరిగిన జిల్లా మహాసభలో వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ,సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు పర్యవేక్షణలో ఎన్నిక జరిగిందని ఒక ప్రకటనలో వేదిక ప్రతినిధులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా గడ్డం గంగులు (బోధన్) ఉపాధ్యక్షులుగా ఎండీ అహ్మద్ (బోధన్), తెయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత, ప్రధాన కార్యదర్శిగా గొంట్యాల రమేష్ (నిజామాబాద్), సహాయ కార్యదర్శులుగా అరుణరేఖ, జగన్ (ఆర్మూర్), కోశాధికారిగా ఆకుల సత్యనారాయణ (నిజామాబాద్), కార్యవర్గ సభ్యులుగా మీనా సహానీ (నిజామాబాద్), అరుణ్‌కుమార్ (బోధన్), మారుతి(బోధన్), శ్రీనివాస్ (బోధన్), అన్వేష్ (నిజామాబాద్), పోచన్న, రామాగౌడ్, కృష్ణ గోపాల్ రావు, నరేందర్ ఎన్నికయ్యారు.

సమస్యలను పరిష్కరించాలి



బోధన్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ. 6వేల పింఛన్ ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టి, సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. దివ్యాంగుల పింఛన్ పెంపుదల, ఇతర డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 9న ఛలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టామని ప్రతినిధులు తెలిపారు. వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గైని రాములు, యేశాల గంగాధర్, షేక్ నజీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

ఆర్మూర్: వేల్పూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన భాగ్యశ్రీ అనే గర్భిణిని ప్రసవం కోసం ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించింది. తల్లి, కూతురు క్షేమంగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. అనంతరం వారిని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సీఎం కప్ నిర్వహణపై సమావేశం

బాల్కొండ: క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్-2024 నిర్వహణపై సోమవారం బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. డిసెంబర్ 7, 8 తేదీల్లో గ్రామ స్థాయిల్లో, డిసెంబర్ 10 నుంచి 12వరకు మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయ్‌భాస్కర్, ఎంఈవో రాజేశ్వర్ తదితరులున్నారు.

విద్యుత్ సమస్యలు తీర్చేదెవరూ?

- రెంజర్లలో లైన్‌మన్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు, రైతులు
- బదిలీల్లో సిబ్బందిని కేటాయించినా.. జాయిన్ కాని లైన్‌మన్



బాల్కొండ : ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి విద్యుత్ లైన్‌మన్ లేకపోవడంతో కరెంట్ సమస్యలు వచ్చినప్పుడు పట్టించుకునేవారు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలల క్రితం జరిగిన విద్యుత్‌శాఖ బదిలీల్లో భాగంగా రెంజర్ల లైన్‌మన్ బాల్కొండ మండలం వన్నెల్(బి)కి బదిలీపై వెళ్లాడు. ఆర్మూర్ మండలం పిప్రి సబ్‌స్టేషన్ నుంచి లైన్‌మెన్ బదిలీపై రెంజర్లకు కేటాయించారు. కానీ లైన్‌మెన్ ఇక్కడికి రావడానికి సుముఖంగా లేక జాయిన్ కాలేదు. దీంతో అప్పటి నుంచి పోస్టు ఖాళీగానే ఉంది. ప్రత్యామ్నాయంగా వేరే లైన్‌మెన్‌ను నియామించుటకు ట్రాన్స్‌కో ఉన్నత అధికారులు కూడ ఎలాంటి ప్రయత్నాలు చేపట్టడం లేదు. దీంతో ప్రజలు, రైతులు విద్యుత్ సమస్యలను ఎవరికి విన్నవించుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు అదనపు బాధ్యతలు

రెంజర్ల సబ్‌స్టేషన్‌కు గతంలో ఇద్దరు లైన్‌మెన్‌లు పని చేశారు. లైన్‌మెన్‌తో పాటు, జూనియర్ లైన్‌మెన్ కూడ పని చేశాడు. ఇక్కడ రెండు లైన్‌మెన్, మూడు సబ్‌స్టేషన్ ఆపరేటర్ల పోస్టులు ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఒక్క లైన్‌మన్ లేడు. ఇద్దరు మాత్రమే ఆపరేటర్లు ఉన్నారు. ఈ సబ్ స్టేషన్ ద్వారా మండలంలోని నాగంపేట్‌కు కూడ విద్యుత్ సరఫరా చేపడుతారు. ప్రస్తుతం లైన్‌ఇన్‌స్పెక్టర్‌తో విద్యుత్ సమస్యలు వస్తే సరిపెట్టుకుంటున్నారు. కానీ లైన్‌ఇన్‌స్పెక్టర్ ఇతర సబ్‌స్టేషన్‌లను కూడా పర్యావేక్షించాల్సిన బాధ్యత ఉండటంతో పూర్తి సమయం కేటాయించలేని పరిస్థితి ఉంది.

ప్రయివేటు మెకానిక్‌లపై ఆధారం..

గ్రామంలో లైన్‌మన్ లేకపోవడంతో ప్రయివేటు మెకానిక్‌లపై ప్రజలు ఆధారపడుతున్నారు. విద్యుత్ సరఫరలో తరచు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ మీటర్లలో సమస్య తలెత్తినా ప్రయివేటు మెకానిక్‌ను సంప్రదించాల్సిన దుస్థితి ఉంది. కరెంట్ మీటర్ కావాలంటే కూడ సెక్షన్ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి వెంటనే లైన్‌మన్‌ను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

రెంజర్లలో లైన్‌మన్ జాయిన్‌కాకపోవడంతోఉన్నతాధికారులకు నివేదించాం. బదిలీల్లో లైన్‌మన్‌ను కేటాయించినా వ్యక్తిగత కారణాలతో జాయిన్ కాలేదని సదరు లైన్‌మన్ తెలిపారు. సమస్యను ఉన్నతాధికారులతో చర్చించి, పరిష్కరించడానికి కృషి చేస్తా.

– శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ, ముప్కాల్ సెక్షన్

ప్రభుత్వ బడుల అభివృద్ధికి కృషి చేస్తా



తొండాకూర్ ప్రభుత్వ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి
- తొండాకూర్ పాఠశాల తనిఖీ

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రభుత్వ బడుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని తొండాకూర్ ప్రభుత్వ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అదించాలని నిర్వాహకులకు, ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు ఎలాంటి భోజనం అందిస్తున్నారో టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. బడిలో అసంపూర్తి నిర్మాణాలపై అధికారులను ప్రశ్నించగా.. నిధులు రాకపోవడంతో నిలిచిపోయానని పంచాయతీరాజ్ ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమవేశాల్లో నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయాలని మాట్లాడుతానన్నారు. హెచ్‌ఎం లింగారెడ్డి, బీజేపీ నాయకులు ముత్యం, సతీష్, తదితరులున్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన..

డొంకేశ్వర్ మండల కేంద్రం నుంచి నూత్‌పల్లి లొంక రామాలయం మీదుగా రూ.1.32కోట్లతో చేపట్టే 1.7కిలో మీటర్ల బీటీ రోడ్డు పనులకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. వెంటనే టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆయన ఆదేశించారు. పీఆర్ డీఈఈ కిషన్, తహసీల్దార్ ఆనంద్, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు బీజేపీ మండలాధ్యక్షుడు పోతుగంటి సురేందర్, నాయకులు కల్లెం సంతోష్‌రెడ్డి, ఆరే గంగాధర్, చిన్నా, చిన్నారెడ్డి, సంజీవ్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిని సోమవారం బీజేపీ నాయకులు సన్మానించారు. ప్రభుత్వాన్ని ఒప్పించి ఆర్మూర్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయించిన సందర్భంగా ఎమ్మెల్యే సన్మానించినట్లు వారు తెలిపారు. నాయకులు జెస్సు అనిల్, కలిగోట ప్రశాంత్, పులి యుగందర్, దోండి ప్రకాశ్, మిరియాల్‌కర్ కిరణ్, ఉదయ్ గౌడ్, పీర్‌సింగ్, జుగ్గె ప్రసాద్ పాల్గొన్నారు.

పది నెలల్లోనే పదేళ్ల అభివృద్ధి సాధించాం



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పది నెలల కాలంలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని సాధించిందని పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి తెలిపారు. పెర్కిట్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారంటీలను నెరవేరుస్తున్నామన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవడం మానుకొని నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తేవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి తాను నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయిస్తే ఎమ్మెల్యే తన కృషిగా గొప్పలు చెప్పుకోవడం తగదన్నారు. డిసెంబరు 9వరకు నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, కౌన్సిలర్లు ఆకుల రాము, ఇంతియాజ అలీ, నాయకులు రహ్మాన్, ఫయాజ్, ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 19వ వార్డులో యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అగర్వాల్ విజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంను సోమవారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ప్రారంభించారు.

నాణ్యమైన ఆహారం ఇవ్వాలి



ఆర్మూర్‌టౌన్: ఏరియా ఆస్పత్రిలో బాలింతలకు, పేషంట్లకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ అన్నారు. పట్టణంలోని ఏరి యా ఆస్పత్రి భోజనశాలను సోమవారం ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. భోజనశాలలో వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలని, వంట చేసే వారు చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోని వంట చే యాలన్నారు. కుళ్లిన కూరగాయలు, నాణ్యతలేని ఆ హార పదార్థాలను వంటలో వాడకూడదని హెచ్చారించారు. ప్రతిరోజు వంటగదిని శుభ్రంగా ఉంచాలన్నారు. సీహెచ్‌వో కృష్ణమూర్తి, ఆర్మూర్ సబ్‌యూనిట్ అధికారి సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

అయ్యప్పస్వాములకు భిక్ష ప్రారంభం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ప్రాంగణంలో సోమవారం అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, అయ్యప్ప సేవా సమితి ఆర్మూర్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం(భిక్ష) ప్రారంభమైంది. అంతకుముందు గురుస్వామి నగేష్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిండి ప్రమిదలతో దీపాలు వెలగించి ఆలయ పూజారికి దీపదానం చేశారు. నందీశ్వర మహారాజ్ సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించారు. 29న సప్తహారతి గిరి రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దైవచింతన అలవర్చుకోవాలి

బోధన్‌రూరల్: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో సోమవారం ఆయన శివాచార్య స్వామిజీ, పిట్ల కృష్ణ మహరాజ్‌లతో కలిసి మహాత్మ బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బోధన్ మండలం పెగడపల్లి గ్రామంలో మహాలక్ష్మీ ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, గ్రామీణ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం బర్దిపూర్, రాజీవ్‌నగర్‌తండాలో నూతన జీపీ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, టీపీసీసీ డెలికేట్ గంగాశంకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, పెగడపల్లి వీడీసీ చైర్మన్ లక్ష్మరెడ్డి నాయకులు నాగేశ్వర్ రావు, నరేందర్ రెడ్డి, ఖాజాపూర్ అశోక్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ఘనంగా భీమన్న ఉత్సవాలు



బాల్కొండ: ముప్కాల్‌లో ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం రెండవ పంథ ఆధ్వర్యంలో సోమవారం భీమన్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గజాలను ఊరేగించి, నది స్నానానికి వెళ్లారు. మంగళవారం అగ్నిగుండం, అన్నదానం నిర్వహిస్తామని సంఘ సభ్యులు తెలిపారు. కొత్తపల్లిలో ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి



రెంజల్‌లోని బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రెంజల్(బోధన్): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి వాజీద్‌హుస్సేన్ అన్నారు. రెంజల్‌లోని బాలుర వసతిగృహాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. హాస్టల్ వార్డెన్ శ్రీకాంత్‌కు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

బాల్కొండ: మండల కేంద్రంలోని మోడల్ కళాశాలల బాలికల వసతిగృహాన్ని ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆహారం కలుషితం కాకుండ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.మెండోరా మండలం పోచంపాడ్‌లోని బాలుర గురుకుల పాఠశాల వసతిగృహాన్ని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేష్ తనిఖీ చేశారు.

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లోని మోడల్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలను ఎంఈవో రాజగంగారాం తనిఖీ చేశారు. పాఠశాలల వంటశాలల్లో సామగ్రి నాణ్యతను పరిశీలించారు. మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్ సుందర్, కేజీబీవీ ఎస్‌వో గంగామణి, వార్డెన్ సునంద తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌టౌన్(బోధన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వసతి గృహంలోని పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఫుడ్ సేఫ్టీ అధికారి వినిత్ సూచించారు. పట్టణంలోని సంక్షేమ వసతి గృహాలను సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మమత తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా పెడుతున్నారు? మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. లోటుపాట్లను గుర్తించి వార్డెన్లకు పలు సూచనలు చేశారు.



బాల్కొండ మండల కేంద్రంలో..



పెర్కిట్‌లో..



బోధన్‌లో..

సంక్షిప్తం

పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. అలాగే ఒలింపియాడ్ స్కూల్, ప్రీ స్కూల్‌లో ఇటీవల నిర్వహించిన ఎస్‌ఏ వన్ పరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజు విద్యార్థులకు లలిత కళల్లో శిక్షణ ఇవ్వడంతో ఇటీవల నేషనల్ భారత్ సేవా పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా సోమవారం పాఠశాలలో ఆయనను ఉపాధ్యాయులు సన్మానించారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయం వద్ద ఆర్మూర్ సర్వసమాజ్ ప్రజాఐక్య సమితి ఆధ్వర్యంలో ప్రహరీ నిర్మాణానికి సోమవారం సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు భూమిపూజ చేశారు. సర్వసమాజ్ కార్యదర్శి కర్తన్ దినేష్, సదర్ల మహేష్, రెడ్డి ప్రకాష్, చిట్టి శ్రీనివాస్, గోపాల్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలి

బాల్కొండ: విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించినపుడే కేరీర్‌లో ముందుకెళ్తారని మోటివేటర్ ఈరవత్రి మారుతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన పదోతరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎంఈవో రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్కొండలో సమీకృత పాఠశాలను నిర్మించాలి

బాల్కొండ: మండల కేంద్రంలో సమీకృత పాఠశాలను నిర్మించాలని బాల్కొండ ఖిల్లా పరిరక్షణ సమితి అధ్యక్షుడు నర్సింగ్‌రావు కోరారు. ఈమేరకు వారు సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని చిన్నయానం, జీజీ నడ్కుడ గ్రామాల్లో పలు బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. నాయకులు మగ్గిడి చిన్నారెడ్డి, నవీన్, రాజు, రంజిత్, నడ్పి సాయన్న తదితరులు ఉన్నారు.

బాల్కొండ మండల కేంద్రంలో..

బాల్కొండ: మండల కేంద్రంలో పలు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. నాయకులు సాగర్ యాదవ్, షాహిద్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాల్కొండ: ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని పలు బాధిత కుటుంబాలను సోమవారం కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు నమోదు చేయించుకోవాలి

పెర్కిట్(ఆర్మూర్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేయించుకోవాలని నిజామాబాద్, ఆదిలాబాదు, మెదక్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పట్టభద్రులు తమ ఓటు నమోదు చేయించుకోవడానికి ఎన్నికల కమిషన్ డిసెంబరు 9 వరకు గడువును పొడగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిజియోథెరపీ శిబిరం

వేల్పూర్: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని ఎంఈవో రేణుక ప్రారంభించారు. ఐఈఆర్‌పీలు శైలజ, మౌళిక పాల్గొన్నారు.

జోరుగా డాటా ఎంట్రీ



బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల పరిషత్ కార్యాలయల్లో సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ జోరుగా సాగుతుంది. బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో 16 మంది ఆపరేటర్లు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ముప్కాల్ మండలంలో 12మంది, మెండోరా మండల కేంద్రంలో 15మంది ఆపరేటర్లు డాటా ఎంట్రీలో బిజీగా ఉన్నారు. ఎంపీడీవోలు డాటా ఎంట్రీని నిత్యం పర్యవేక్షిస్తున్నారు. తప్పులు లేకుండ ఎంట్రీ చేయాలని సూచిస్తున్నారు. మరిన్ని కంప్యూటర్లు ఏర్పాటు చేసి డాటా ఎంట్రీని వేగంగా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

రైతు శ్రేయస్సు కోసమే 'సంఘాల ఏర్పాటు'



కమ్మర్‌పల్లి: రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో ప్రయోజనం ఉంటుందని, రైతుల శ్రేయస్సు కోసమే మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసినట్లు ఐకేపీ జిల్లా ఫామ్ విభాగం డీపీఎం మారుతి అన్నారు. కమ్మర్‌పల్లిలో సోమవారం వారు మహిళా రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గం పరిధిలో శ్రీరాంసాగర్ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీని రిజిస్టర్ చేయడంతో పాటు, దానికి అనుబంధంగా అన్ని మండలాలలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు వంటి అవసరాలను స్థానికంగా తీర్చుకోవడానికి ఈ సంఘాలను వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఏవో రమ్యశ్రీ మాట్లాడుతూ, రైతులు వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలలో కూడా రాణించాలని సూచించారు. ఏపీఎం కుంట గంగాధర్ మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు చేపట్టే రైతులకు 35 శాతం సబ్సిడీతో రుణాలు ఇప్పిస్తామన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 -	మందిర (తెలుగు)-10.30 దేవకి నందన వాసుదేవ (తెలుగు)-1.15 7.30 జిబ్రా(తెలుగు)-4.05 10.25
స్కీన్-3 -	మెకానిక్‌రాకీ(తెలుగు)-12.15 6.45 10.00 లక్కీ భాస్కర్(తెలుగు)-3.30
స్కీన్-4 -	అమరన్(తెలుగు)-11.35 6.20 మెకానిక్‌రాకీ(తెలుగు)-3.05 లక్కీభాస్కర్(తెలుగు)-9.50

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	అమరన్ -10.30 4.25 10.30 లక్కీ భాస్కర్(తెలుగు)-1.30 7.40
స్క్రీన్-3	కంగువ(2డీ-తెలుగు)-10.30 4.30 10.40 అమరన్ -1.30 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కంగువ 3డీ తెలుగు-11.50 3.15 6.40 10.10
స్క్రీన్-2	గ్లాడియేటర్-2 (తెలుగు)-12.10 మట్కా(తెలుగు)-3.35 7.00 క(తెలుగు)-10.25
స్క్రీన్-3	అమరన్(తెలుగు)- 11.45 3.15 6.50 లక్కీ భాస్కర్(తెలుగు)-10.25
స్క్రీన్ -4	క(తెలుగు)-1.00 లక్కీ భాస్కర్(తెలుగు)-4.15 గ్లాడియేటర్(తెలుగు)- 7.30 అమరన్(తెలుగు)- 10.45
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	మట్కా (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,300	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	71,317		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800